క్లుప్తంగా

ఇంటర్న్‌షిప్‌కు వెళ్లిన డీఎన్నార్ కళాశాల విద్యార్థినులు

పాలకొల్లు సెంట్రల్: నూతన విద్యా విధానంలో భాగంగా డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థినులను ఇంటర్న్‌షిప్‌నకు పంపిస్తున్నామని డీఎన్నార్ కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి తెలిపారు. గురువారం దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా కళాశాల ఆవరణలో ఇంటర్న్‌షిప్ ట్రైనింగ్‌కు వెళుతున్న విద్యార్థినులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శోభారాణి మాట్లాడుతూ బెంగుళూరులో ఉన్న విన్‌స్టన్ సెల్‌ఫోన్ కంపెనీకి 31 మంది విద్యార్థినులు వెళుతున్నట్లు తెలిపారు. విద్యార్థినుల తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ఒప్పుకుని విద్యార్థినులను ట్రైనింగ్‌కు పంపిచడం అభినందనీయమని అన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 25 మంది ఎంపిక

పాలకొల్లు సెంట్రల్: స్థానిక బీఆర్ఆర్ అండ్ జీకేఆర్ ఛాంబర్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 25 మంది అభ్యర్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం దివీస్ లాబొరేటరీస్ సంస్థ నిర్వహించిన ఈ ప్రాంగణ ఎంపికలో 65 మంది అభ్యర్థులు పాల్గొనగా 25 మంది ఎంపికయ్యారన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ. 28 వేలు వేతనం అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కలిదిండి రామరాజు, దివీస్ ల్యాబ్ హెచ్ఆర్ పూర్ణప్రసాద్, ప్లేస్మెంట్ ఆఫీసర్ లక్ష్మణరావు, అధ్యాపకులు శివన్నారాయణ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్రలో డ్రైవర్లకు కంటి వైద్య పరీక్షలు



వైద్య శిబిరానికి హాజరైన ఎంవీ ఇన్‌స్పెక్టర్‌ను అభినందిస్తున్న డ్రైవర్లు

నరసాపురం రూరల్: డ్రైవర్లు నిర్దిష్ట కాలానికి తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని తద్వారా అనారోగ్య సమస్యలను ముందుగా గుర్తించి చికిత్స చేయించుకునే అవకాశం ఉంటుందని పాలకొల్లు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు అన్నారు. 35వ జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా గురువారం నరసాపురం మండలం స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో బస్సు, ఆటో, క్యాబ్ డ్రైవర్లకు కంటి, ఇతర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడారు. ఈ వైద్య శిబిరానికి 150 మంది హాజరయ్యారు. వీరిలో 59 మందికి కళ్లద్దాలు, ఐదుగురికి కంటి ఆపరేషన్లు అవసరమని వైద్యులు గుర్తించారు. కార్యక్రమానికి హాజరై అవసరమైన డ్రైవర్లందరికీ కళ్లద్దాలు, ఉచితంగా మందులను అందజేశారు.

కమిషనర్‌ను కలిసిన ప్రభుత్వ వాహనాల డ్రైవర్ల సంఘం



కమిషనర్‌తో ప్రభుత్వ వాహనాల డ్రైవర్ల సంఘ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: తమ సమస్యలు ఏమైనా ఉంటే వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుని తమకు సహకరించాలని ప్రభుత్వ వాహనాల డ్రైవర్ల సంఘం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షులు దత్తి వేణుగోపాల స్వామి అన్నారు. గురువారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్ శేషాద్రిను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వేణుగోపాలస్వామి మాట్లాడుతూ జిల్లాలో అన్ని కార్యాలయాలు తిరిగి అధికారులను మర్యాదపూర్వకంగా కలుస్తున్నామన్నారు. ఇలా జిల్లాలో ఒక్కో ప్రాంతంలో ఒక్కో డిపార్ట్‌మెంట్ అధికారిని కలుస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంఘ జిల్లా ముఖ్య సలహాదారులు వైజీఎల్ నారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు ఆళ్ల తాతారావు, భీమవరం డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు ముత్యాల ప్రసాద్, పి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల రహిత సమాజాన్ని నిర్మిద్దాం

భీమవరం: మత్తు పదార్థాలు సేవించడం వల్ల యువత తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని, మత్తు పదార్థాల రహిత సమాజాన్ని నిర్మించేందుకు జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యాన ఈనెల 18వ తేదీ వరకు 'రండి.. మత్తు రహిత సమాజాన్ని నిర్మిద్దాం' అనే నినాదంతో రాష్ట్ర స్థాయి అవగాహన ఉద్యమాన్ని చేపట్టినట్లు ఉద్యమ పట్టణ కన్వీనర్ మొహమ్మద్ సిద్దీఖ్ తెలిపారు. గురువారం భీమవరంలో ఉద్యమం ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో భాగంగా డోర్ టు డోర్ క్యాంపెయిన్, కరపత్రాలు, పోస్టర్లు, సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం, రౌండ్ టేబుల్ సమావేశాలు, బహిరంగ సభలు, వ్యాసరచన పోటీలు వంటివి నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందజేమని చెప్పారు. అనంతరం ఉద్యమ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

చంద్రబాబును నమ్మితే మోసపోతారు

మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు



తూర్పుపాలెంలో సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళలు



తూర్పుపాలెంలో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజును సత్కరిస్తున్న దృశ్యం

పెనుగొండ: ఏనాడూ ఇచ్చిన మాటను నిలుపుకోని చంద్రబాబును నమ్మితే మోసపోవాల్సిందేనని, మోసకారి చంద్రబాబుకు మహిళలు అందరూ బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. తూర్పుపాలెంలో పదిరోజులుగా నిర్వహిస్తున్న ఆసరా-మనసారాలో భాగంగా ఆఖరి రోజు గురువారం 10 వేలకు పైగా మహిళలకు డ్వాక్రా రుణమాఫీ వైఎస్సార్ ఆసరా నాలుగో విడత చెక్కును అందించి మహిళలకు ఆత్మీయ విందును అందించి చీరలు పంపిణీ చేశారు. 2014లో రుణమాఫీ చేస్తానని, బంగారాలు బ్యాంకుల నుంచి విడిపించుకోవద్దంటూ నమ్మబలికి మొండి చెయ్యి ఇచ్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. దీంతో రైతు పూర్తి రుణమాఫీ అంటూ హామీ ఇచ్చి కేవలం రూ.1.50 లక్షలు మాత్రమే ఇస్తానని మాట మార్చడంతో పాటు, చివరకు రుణమాఫీ ఆఖరి విడతను సైతం ఇవ్వకుండా ఆర్థికంగా మహిళలను, రైతులను అప్పులు పాలు చేసారని విమర్శించారు. అటువంటి చంద్రబాబును నమ్మవద్దన్నారు. నవరత్నాలతో మహిళలకు ఆర్థిక భరోసా ఇస్తున్న సంక్షేమ పథకాలను చంద్రబాబు రద్దు చేస్తారన్నారు. పేదలకు, మహిళలకు అండగా నిలుస్తున్న వలంటీర్లపై విషం గక్కుతున్నారన్నారు. మహిళలు వీరికి తగిన బుద్ధి చెప్పాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ సామాజిక న్యాయం చేయడంలోనూ, సామాన్యులకు అండగా నిలవడంలోనూ సీఎం జగన్ ఎపుడూ ముందంజలో ఉంటారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు కర్రి గౌరి సుభాషిణి, పోడూరి గోవర్ధన, ఆచంట ఏఎంసీ చైర్ పర్సన్ చిల్లే లావణ్య, పెనుగొండ మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షురాలు దండు పద్మావతి, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టరు మామిడిశెట్టి కృష్ణవేణి, ఏపీ ఉమెన్ వెల్ఫేర్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టరు బొక్కా అరుణ, సర్పంచ్‌లు కోట సరోజినీ, దిరిశాల విజయలక్ష్మి, మట్టా కుమారి, చుట్టుగుళ్ల పూర్ణిమ, గణేషుల శేషవేణి గొట్టుముక్కల సోనీయా రాణి, గుబ్బల ఉషారాణి, గుడాల శిరీష, ఇళ్ల చంద్రిక, మామిడిశెట్టి ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పట్టాలు మార్చి మార్చి ఇచ్చేవారు



గత ప్రభుత్వంలో ఎమ్మెల్యేలు పేదలకు అందించే ఇళ్ల పట్టాలను మార్చిమార్చి ఇచ్చేవారు. ఇచ్చిన పట్టాలే మళ్లీ ఇస్తున్నట్లు ఆర్భాటం చేసేవారు. పెనుమంట్రలో ఇదే పరిస్థితి ఉంది. అంతేగాకుండా మౌలిక సదుపాయాలు కల్పించలేదు. ఒక్కరాత్రిలో మౌలిక సదుపాయాలు కల్పించిన ఘనత సీఎం జగన్‌కు, మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుకు దక్కుతుంది. పెనుమంట్రలో త్రాగునీటి సమస్యను శ్రీరంగనాథరాజు పరిష్కరించారు.

– తాడివర్తి ప్రియాంక, పెనుమంట్ర సర్పంచ్

జగనన్నే కావాలి... జగనన్నే రావాలి..



పేదలకు మేలు చేస్తున్న సీఎం జగనన్నే మాకు కావాలి. మళ్లీ జగనే అధికారంలోకి రావాలి. నాకు భర్త లేరు. వితంతువు పింఛన్ వలంటీర్ 1వ తేదీ ఉదయమే అందిస్తుంది. నాకు కాపు నేస్తంలో రూ.15వేలు సహాయం అందుతుంది. జగనన్నకి ఓటు వేసి రుణం తీర్చుకుంటాం.

– కె.లక్ష్మీదేవి, 25వ వార్డు, పాలకొల్లు

ఇంటి స్థలం ఇచ్చారు



నా భర్త ఇమ్మానియేలు అనారోగ్యంతో ఏడేళ్ల క్రితం మృతి చెందారు. నా కుమార్తె హెప్సిబా ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. సీఎం జగన్ దయ వల్ల అమ్మ ఒడి పథకం వస్తుంది. అలాగే ఇంటి స్థలం ఇచ్చారు. ఇల్లు కట్టుకోవడానికి రుణం కూడా మంజూరు అయ్యింది.

– ఎలిపే గ్లోరీ, 8వ వార్డు, పాలకొల్లు

సీఎం జగనన్నను ఆశీర్వదించాలి



భోజనాలు చేస్తున్న మహిళలకు అభివాదం చేస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు-మంగతాయారు దంపతులు



ఆసరా సంబరాల్లో పాల్గొన్న 24వార్డు నుంచి 31వార్డు మహిళలు

పాలకొల్లు అర్బన్: అక్క,చెల్లెమ్మలకు ఆసరాగా నిలిచి చేయూత అందించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మనసారా ఆశీర్వదించాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) కోరారు. పాలకొల్లు వైఎస్సార్ సీపీ కార్యాలయ ఆవరణలో గురువారం పట్టణంలోని 24వ వార్డు నుంచి 31వ వార్డులకు చెందిన డ్వాక్రా మహిళలతో ఆసరా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో గుడాల గోపి మాట్లాడారు. ప్రజల్ని మోసం చేయడం చంద్రబాబుకి బాగా తెలుసని, ప్రజలకు మేలు చేయడం సీఎం జగన్‌కి తెలుసన్నారు. సీఎం జగన్ పాలనలో జరిగిన సంక్షేమ, అభివృద్ధి దేశంలో ఏ రాష్ట్రంలోనూ జరగలేదన్నారు. విద్యాపరంగా ఒకప్పుడు కేరళ ఉంటే ప్రస్తుతం ఏపీ ముందుందని గుడాల గోపి స్పష్టం చేశారు. అలాగే రైతు భరోసా కేంద్రాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు.

టిడ్కో గృహాల పాపం ఎమ్మెల్యే నిమ్మల, చంద్రబాబులదే...

టిడ్కో గృహాలు లబ్ధిదారులకు చేరకపోవడానికి, వారి వద్ద నుంచి డబ్బులు వసూళ్లు చేసుకుని మోసం చేసిన పాపాత్ములు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, చంద్రబాబునాయుడని గుడాల గోపి స్పష్టం చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హాయంలో 69 ఎకరాలు భూసేకరణ చేసి లబ్ధిదారులకు వ్యక్తిగతంగా ఇంటి స్థలాలు ఇవ్వాలని అప్పట్లో ఆలోచన చేశారన్నారు. అయితే టీడీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోని టిడ్కో గృహాల మీద వ్యాపారం చేసుకుని లబ్ధిదారులను బ్యాంకులకు తాకట్టు పెట్టి కోట్లాది రూపాయలు దోచుకుని లబ్ధిదారులను మోసం చేశారన్నారు. కనీసం ఎకరం భూమి కూడా టీడీపీ హయాంలో కొనలేదన్నారు. అలాగే లిఫ్ట్ లేకుండా నాలుగు అంతస్తులు నిర్మించారన్నారు. నాసిరకం పైపులు వాడిన కారణంగా 3,4అంతస్థుల వారు వాడిన వాడకం నీరు పైపుల ద్వారా లీకై 1, 2ఫ్లోర్ లోకి పారుతుందన్నారు. ఎమ్మెల్యే నిమ్మల చేసిన మోసాన్ని అక్క చెల్లెమ్మలు గ్రహించాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి పనులు చేస్తుంటే ఎమ్మెల్యే నిమ్మల చొక్కా విప్పి రోడ్డెక్కి ధర్నాలు చేస్తారని దుయ్యబట్టారు. ప్రస్తుతం టిడ్కో గృహాలు పనులు పూర్తి కావస్తున్నాయని త్వరలోనే వాటిని లబ్ధిదారులకు అందజేస్తామని గుడాల గోపి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ సాలా నరసయ్య, పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు, సచివాలయ కన్వీనర్ మోర్త గిరీష్, రాష్ట్ర అర్బన్ అండ్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ డైరెక్టర్ వనుం సత్యకళ్యాణి, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి మద్దా చంద్రకళ, సహాయ కార్యదర్శి కర్రా జయసరిత, ఆలయాల చైర్మన్‌లు కోరాడ శ్రీనివాసారవు, జోగి వెంకటేశ్వరరావు, నంబూరి శ్రీగంగా పవన్‌కుమార్, మామిడి వెంకటేశ్వరరావు, సచివాలయ జిల్లా ప్రతినిధి ఖండవల్లి వాసు, వార్డు ఇన్‌చార్జ్‌లు శీలం సూరిబాబు, బండి రమేష్, ఉప్పె పండుబాబు, కెల్లా పెద్దిరాజు, చినిమిల్లి గణపతిరావు, కుసుమే ఝాన్సీ హేమలత తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి సీతారామ కల్యాణ మహోత్సవాలు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక యడ్లబజారు సెంటర్‌లోని శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవాలు ఈ నెల 14 నుంచి 19 వరకూ ఆరు రోజులు పాటు నిర్వహించనున్నారు. బుధవారం విష్వక్సేన పూజతో ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. శుక్రవారం రథసప్తమి రోజున సాయంత్రం 6.39 గంటలకు నిత్యహోమం, బలిహరణ రాత్రి 7.29 గంటలకు శ్రీ సీతారామ కల్యాణం నిర్వహించనున్నారు. ఉత్సవాలు ప్రారంభం నుంచి ఐదు రోజులు ఉదయం 6.39 గంటలకు శ్రీ పంచముఖ ఆంజనేయస్వామికి సామూహిక సహస్రనామార్చనలు జరపనున్నారు. ఈ పూజలు చేయించుకునే భక్తులు రూ. 396లు చెల్లించి పేర్లు నమోదు చేయించుకోవాలని శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి సేవాసమితి సభ్యులు తెలిపారు. శనివారం సదస్యం, సోమవారం ఉదయం పూర్ణాహూతి హోమం, చక్రస్నానం రాత్రి శ్రీ పుష్పయాగంతో ఉత్సవాలు ముగించనున్నారు. ఆలయ ప్రధానార్చకులు రమణ గురుస్వామి, రఘు, శ్రీ సీతారామ కల్యాణ ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

విస్తృతంగా పారిశుద్ధ్య చర్యలు



కొమ్ముచిక్కాల గ్రామంలో డ్రైయినేజీలో పూడిక తొలగింపు పనులు చేస్తున్న దృశ్యం

పోడూరు: కొమ్ముచిక్కాల గ్రామంలో కొద్దిరోజులుగా పారిశుద్ధ్య చర్యలు విస్తృతంగా నిర్వహిస్తున్నారు. పనులను గురువారం ఈఓపీఆర్‌డీ ఎం.బలరామరాజు, పంచాయతీ కార్యదర్శి ఎం.హనుమంతరావు పరిశీలించారు. గ్రామంలో డ్రెయినేజీల్లో సిల్టు తొలగింపు, చెత్తకుప్పల తొలగింపు పనులు నిర్వహిస్తున్నామనీ, చెత్తనిల్వలను డంపింగ్ యార్డుకు తరలిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి హనుమంతరావు తెలిపారు. అలాగే రానున్న వేసవిలో గ్రామ ప్రజలకు తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా పంచాయతీ వద్ద కొత్తగా బోర్‌పాయింట్ కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మంచినీటి పైప్‌లైన్ మరమ్మతు పనులు కూడా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సర్పంచ్ గుంటూరి రామకృష్ణంరాజు పనులను పర్యవేక్షించారు.

నులిపురుగుల నివారణపై అవగాహన



పాలకొల్లు సెంట్రల్: నులిపురుగుల దినోత్సవం సందర్భంగా అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



పాలకొల్లు అర్బన్: ఎంపీడీవో కార్యాలయం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: నులిపురుగుల బారిన పడ్డ పిల్లలు శారీరకంగా, మానసికంగా బలహీన పడతారని డాక్టర్ హెలీనా అన్నారు. గురువారం స్థానిక వీవర్స్ కాలనీ జీవీఎస్‌వీఆర్‌ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హెలీనా మాట్లాడుతూ చేతి గోళ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిశుభ్రమైన నీటిని తాగాలని సూచించారు. తినే ఆహారాన్ని భద్రంగా ఉండాలని పండ్లు, కాయగూరలు తినే సమయంలో శుభ్రంగా కడుక్కుని తినాలన్నారు. మన పరిసరాలు ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆల్బెండజోల్ మాత్రలను ఒకటి నుండి రెండేళ్ల లోపు పిల్లలకు సగం మాత్ర పొడర్ చేసి నీళ్లలో కరిగించి వేయాలన్నారు. మూడేళ్ల నుంచి 19 ఏళ్ల విద్యార్థులు ఈ టాబ్లెట్ నమిలి మింగాలన్నారు. సమావేశం అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయపూడి భవానీప్రసాద్ పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయం వద్ద

పాలకొల్లు అర్బన్: జాతీయ నులిపురుగు నివారణ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీడీఓ ఎం.అనుపమ కోరారు. పాలకొల్లు ఎంపీడీఓ కార్యాలయం వద్ద నులిపురుగు నివారణ పోస్టర్‌ను గురువారం ఆమె ఆవిష్కరించారు. ఈ నెల 9న అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆల్బెండాజోల్ మాత్రలను మింగించాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డా. అద్దాల ప్రతాప్‌కుమార్, ఏఈ కె.శ్యామ్యూల్, ఎంఈఓలు గుమ్మళ్ల వీరాస్వామి, ఆర్‌ఎస్‌వీఎస్ గంగాధరశర్మ, ఏఓ కె.గోవిందరాజులు పాల్గొన్నారు.

సామూహిక ఎలుకల నిర్మూలన చేపట్టాలి



మొగల్తూరు: పాలకమ్మ చెరువులో ఎలుకల బొరియలను పరిశీలిస్తున్న ఏఓ రహీమ్



పెనుగొండ: వడలిలో రైతులకు విషపు ఎరను పంపిణీ చేస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

మొగల్తూరు: ఎలుకల నిర్మూలనను రైతులు సామూహికంగా చేపట్టాలని వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ సూచించారు. సామూహిక ఎలుకల నిర్మూలనలో భాగంగా గురువారం మొగల్తూరులోని పాలకమ్మచెరువు, ఇంజేటివారిపాలెం, నక్కావారిపాలెం తదితర ప్రాంతాల్లో పర్యటించి వ్యవసాయ గట్లలో ఉన్న ఎలుకుల బొరియలను పరిశీలించి మట్టితో మూసివేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలుకల నిర్మూలనకు బ్రోమోడయోలిన్‌లో నూకలు, నూనె కలిపిన మందును శుక్రవారం ఉచితంగా రైతులకు అందిస్తామన్నారు. ఎలుకల కన్నాలను గుర్తించి కన్నానికి ఒక పొట్లం చొప్పున ఉంచాలన్నారు. పంట కాలమంతా బ్రోమోడయోలిన్ మందును వాడటం ద్వారా మంచి ఫలితాలు ఆశించవచ్చున్నారు.

ఈ-కేవైసీ నమోదు తప్పనిసరి

సాగు చేస్తున్న ప్రతి రైతూ తమ పంట వివరాలను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ కోరారు. గురువారం మొగల్తూరు పడమటిపాలెంలోని రైతు భరోసా కేంద్రంలో ఈ-కేవైసీ నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ-కేవైసీ నమోదు కారణంగా ప్రభుత్వం అందించే ఇన్‌పుట్ సబ్సిడీ, ఇతర రాయితీలు వర్తిస్తాయన్నారు. మండలంలో సాగు చేపట్టిన ప్రతి రైతూ ఈ నెల 10లోపు నమోదు చేయించుకోవాలని సూచించారు.

పెనుగొండలో..

పెనుగొండ: దిగుబడులకు నష్టం కల్పించే ఎలుకల నిర్మూలనకు సామూహికం చేపడితేనే ఫలితం ఉంటుందని వ్యవసాయాధికారి పి.స్పందన అన్నారు. గురువారం మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో బ్రోమోడయోలిన్ కలిపిన విషపు ఎరలను రైతులకు పంపిణీ చేశారు. గ్రామాల్లో ముందురోజే వ్యవసాయ సిబ్బంది, రైతులు కలిపి పొలాల్లో తెరచి ఉన్న ఎలుక కన్నాలను గుర్తించడంతో తెరచి ఉన్న కన్నాల వద్ద బ్రోమోడయోలిన్, నూకలు, నూనే కలిపిన విషపు ఎరను ఉంచి నివారణకు కృషి చేయాలన్నారు. వరి పొలం గట్ల వద్దనే కాకుండా, ఖాళీ దిబ్బలు, కళ్లాలు, కాలవ గట్లు పైనా ఎరలను పెట్టాలన్నారు. కార్యక్రమంలో వడలి సర్పంచ్ కాసాని విజయలక్ష్మీ పెద్దిరాజు, నడిపూడి సర్పంచ్ కడలి బేబీ అన్నపూర్ణ, సొసైటీ అధ్యక్షుడు కేశవరపు గణపతి, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి గణేశ్వరరావు, చిటికెన దుర్గా భవానీ బాబీ తదితరులు పాల్గొన్నారు.

ఆగని చెరువు పూడిక పనులు



చెరువు పూడుస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న ఓ చెరువు పూడికపై సంబంధిత ప్రభుత్వ అధికారులు పని తీరు ప్రశ్నార్థకంగా ఉంది. కొద్దిపాటి వర్షానికే రైల్వే స్టేషన్ రోడ్డు మొత్తం మునిగిపోతుంది. ప్రస్తుతం స్టేషన్ ఎదురుగా ఉన్న చెరువు పూడిక పనులు నిలిపివేయాలంటూ మునిసిపల్ అధికారులు ఆదేశించారు. అయితే ఈ చెరువు పూడికపై తాము ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని చెరువు పూడుస్తున్నట్లు తమకు తెలియదని బదిలీపై వెళ్లిన తహసీల్దార్ వివరణ ఇవ్వడం తెలిసిందే. కింది స్థాయి అధికారులు రిపోర్టులు ఇచ్చినా ఆయన మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అయితే మైనింగ్ అధికారులు మాత్రం భీమవరం నుంచి చెరువు పూడిస్తే చర్యలు తీసుకుంటామని ప్రకటనలు ఇస్తున్నా పూడిక మాత్రం ఆగడం లేదు. అయితే ఈ పూడికపై రైల్వే అధికారుల తీరు విస్మయం కలిగిస్తుంది. చెరువు పూడ్చాక తమ స్థలంలో గోడ కట్టేసుకోవచ్చనే రైల్వే అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. చెరువు పూడికపై ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

భీమవరం అర్బన్: భీమవరం మండలంలోని రాయలం గ్రామంలో కొలువైయున్న శ్రీ బాల త్రిపుర సుందరీ సమేత రామలింగేశ్వరస్వామి హుండీ ఆదాయాన్ని గురువారం దేవాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో లెక్కించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి రామకృష్ణంరాజు, ఆలయ కమిటీ చైర్మన్ చినిమిల్లి వెంకటరామయ్య (బాబి) మాట్లాడుతూ 17 నెలలకు గానూ హుండీ ఆదాయాన్ని లెక్కించగా రూ.లక్షా 66 వేల 200 వచ్చినట్లు చెప్పారు.

వసతి గృహం ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

ఆకివీడు: స్థానిక నగర పంచాయతీ పరిధిలో ప్రత్యేక అవసరాలు కలిగిన బాలికల వసతి గృహం ఏర్పాటుకు స్వచ్ఛంద సంస్థల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారిణి బి.సుజాతా రాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 16వ తేదీలోగా ఆయా స్వచ్ఛంద సంస్థలు రిజిస్ట్రేషన్ ధ్రువపత్రం, సభ్యుల వివరాలు, సంస్థ మూడేళ్లుగా చేస్తున్న సేవల వివరాలతో మూడు సెట్‌ల దరఖాస్తులను భీమవరంలోని కార్యాలయంలో అందజేయాలని కోరారు.